సాక్షి చిత్తూరు
ఆదివారం । 24 । ఆగస్టు । 2025



వర్షం.. అపార నష్టం
గుడిపాల మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిని అపార నష్టం వాటిల్లింది. - 8లో



రాష్ట్రంలో అరాచక పాలన
కూటమికి మంచి బుద్ధి ప్రసాదించు స్వామీ అని పంచలింగేశ్వరునికి వైఎస్సార్ సీపీ నేతలు పూజలు చేశారు. - 8లో



రాజనాలబండకు చేరిన..
రెండు వేర్వేరు చోట్ల జరిగిన చోరీ ఘటనల పంచాయితీలు రాజనాల బండ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయానికి చేరాయి. - 8లో

న్యూస్‌రీల్

29, 30 తేదీల్లో సీఎం కుప్పం పర్యటన



మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం: సీఎం చంద్రబాబు ఈ నెల 29, 30వ తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. శనివారం కుప్పం కడా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ పనులు పూర్తి కావడంతో కృష్ణా జలాలు కుప్పానికి వస్తున్నాయని, ఈ కార్యక్రమంలో భాగంగా జలహారతి కోసం సీఎం కుప్పంలో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 29వ తేదీన సాయంత్రం కుప్పం పట్టణానికి చేరుకుని, 30వ తేదీ ఉదయం మండలంలోని పరమసముద్రం చెరువు వద్ద జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా పరమసముద్రం చెరువును నీటితో నింపి అనంతరం దశల వారీగా నియోజకవర్గంలోని 435 చెరువులను అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీఎంకే ఉడా చైర్మన్ సురేష్‌బాబు, కడా అభివృద్ధి కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుశాఖలో స్వచ్ఛత దివాస్



మొక్క నాటి నీరు పోస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చిత్తూరు అర్బన్: స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛత దివాస్ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్తూరులోని పోలీసు శిక్షణ కేంద్రం(డీటీసీ)లో మొక్కలు నాటారు. శనివారం ఏఎస్పీ రాజశేఖర్ రాజు, అధికారులు కలిసి డీటీసీలో పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛ దివాస్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శివానంద కిషోర్, డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వెరిఫికేషన్‌కు ధ్రువీకరణ తప్పనిసరి

చిత్తూరు అర్బన్: పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు తప్పనిసరిగా ఓ ఫారంను డౌన్‌లోడ్ చేసుకుని ధ్రువీకరణ చేసుకుని వెరిఫికేషన్‌కు రావాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ తెలిపారు. సోమవారం చిత్తూరులోని ప్రశాంత్ నగర్‌లో ఉన్న జిల్లా పోలీసు కార్యాలయంలో 9 గంటల నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. దీనికి అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అనెగ్జర్–1 డౌన్‌లోడ్ చేసుకుని గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించుకుని రావాలని ఎస్పీ కోరారు.

సర్వే చేసి అనర్హురాలిగా ముద్రవేశారు!



పలమనేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాపులమ్మ

పలమనేరు: మండలంలోని టి. వడ్డూరు గ్రామానికి చెందిన పాపులమ్మ (69) పక్షవాతం కారణంగా కాళ్లు చచ్చుబడిపోవడంతో సరిగ్గా నడవలేదు. సదరం సర్టిఫికెట్‌లో 40 శాతం కంటే ఎక్కువగా వికలత్వం ఉందని ఆమెకు మొన్నటి దాకా వికలాంగ పింఛన్ ఇచ్చేవారు. ఇటీవల జరిగిన పింఛన్ల పునఃపరిశీలనలో వికలత్వ శాతం 40 కంటే తక్కువగా ఉందని పింఛను తీసేశారు. ప్రస్తుతం ఈమె మధుమేహం, రక్తపోటుతో అనారోగ్యంతో పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈమె భర్త చిన్నపాటి చిల్లర దుకాణం ద్వారా భార్యను చూసుకుంటున్నాడు. అతనికి అనారోగ్య సమస్యలున్నాయి. వీరి ఇద్దరు పిల్లలకు వివాహమై వారి కుటుంబాలను వారు చూసుకుంటున్నారు. దీంతో వారికి ఆసరాగా ఉన్న పింఛను పోవడంతో ఎలా బతికేదో దేవుడా? అని బాధపడుతున్నారు.


28 లోపు పేర్లు నమోదు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 28వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌ఆర్‌బీ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు 28వ తేదీ లోపు 9849313676, 9000475799 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకుని క్రీడాకారులకు పోటీల్లో పాల్గొనే అవకాశం ఉండదన్నారు.

వరసిద్ధుడి వేడుక.. జగమంత పండుగ

ముసిముసి నవ్వులవాడా.. మూషిక వాహనా.. చంద్రశేఖర కుమారా.. భక్తజన ప్రియదేవరా.. పార్వతీ తనయా.. సర్వపాపహరణా.. సకల జన పరిపాలకా.. ఉదర నాగాభరణ ప్రకాశితా.. వరసిద్ధి వినాయకా.. నమోనమామి.. పద్మహస్తభూషితా.. సదా స్మరామి.. మహా ఏకదంతా.. ప్రణమిల్లుతాం.. మేమంతా.. నీదే ఈ జగమంతా.. వరాల వేడుకకు వేళాయే.. సర్వ సిద్ధమాయే.. ఓ బొజ్జగణపయ్యా.. బేగి రావయ్యా!!





- వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు
- కాణిపాకంలో ఉట్టిపడుతున్న ఉత్సవశోభ
- 27 నుంచి కాణిపాక వార్షిక బ్రహ్మోత్సవాలు
- భక్తులకు ఇబ్బంది లేకుండా ముందస్తు ప్రణాళికలు

కాణిపాకం: స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి వారికి ఈ నెల 27వ తేదీన వినాయక చవితి మొదలు 21 రోజుల పాటు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాలకు ఆలయాధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వరసిద్ధి వినాయక స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఆలయానికి పెయింటింగ్ పనులను పూర్తి చేస్తున్నారు. భక్తులు ఉండేందుకు తాత్కాలిక షెడ్లు, విద్యుత్ కటౌట్లు, రంగువల్లులతో ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. మరో మూడు రోజుల్లో ఈ పనులను పూర్తి చేయనున్నారు. బ్రహ్మోత్సవాలకు రెండు రోజులకు ముందే అన్ని ఏర్పాట్లను వందశాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ పనులను ఈఓ పెంచల కిషోర్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.



విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



ఆలయం లోపలి భాగంలో పెయింటింగ్ వేస్తున్న పెయింటర్లు



విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



రంగువల్లులు తీర్చిదిద్దుతున్న కళాకారులు

సర్వం సన్నద్ధం



సాక్షి ముఖాముఖిలో ఈఓ పెంచల కిషోర్

వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఆలయాధికారులు సన్నద్ధమయ్యారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు శరవేగంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో బ్రహ్మోత్సవాలను పకడ్బందీగా జరిపించేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 27వ తేదీ నుంచి జరిగే ఏర్పాట్లపై ఆలయ ఈఓ పెంచల కిషోర్ సాక్షి ముఖాముఖిలో పలు విషయాలను పంచుకున్నారు. ఆయన మాటాల్లోనే..
– కాణిపాకం

- ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకు వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు, నిర్వహణ పనులు జరుగుతున్నాయి.
- వినాయక చవితి, రథోత్సవం, కల్పవృక్ష వాహనం, తెప్పోత్సవం, పుష్పపల్లకి రోజుల్లో సుమారు 70 వేల నుంచి 80 వేల మంది భక్తులు, మిగిలిన రోజుల్లో 40 వేల మంది భక్తులు వస్తారని అంచనా. ఉత్సవాల సందర్భంగా ఆర్జిత సేవలు రద్దు చేశాం. దర్శన సేవలు యథావిధిగా కొనసాగుతాయి. ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేస్తున్నాం.
- వాహనాల పార్కింగ్‌కు కాణిపాకం బస్టాండ్ పక్కన ఉన్న ప్రాంతం, కొబ్బరితోట, ఈఓ కాంప్లెక్స్ పక్కన స్థలాలను కేటాయించాం. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.
- ప్రధానంగా నిఘా వ్యవస్థ పటిష్టంగా పనిచేయనుంది. ప్రత్యేక రోజుల్లో 200 మంది పోలీసులతో బందోబస్తు ఉంటుంది. సాధారణ రోజుల్లో 100 మంది వరకు పోలీసులుంటారు. ఈ సారి సీసీ కెమెరాలతోపాటు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టేలా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.
- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ బృందం 500 మందితోపాటు మరో 50 మంది సిబ్బందిని అదనంగా తీసుకుంటున్నాం. అన్నదానానికి 20 మంది అవసరమవుతోంది. సేవకులుగా పనిచేసేందుకు 500 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అవసరం ఆధారంగా వారిలో 100 మంది వరకు తీసుకుంటాం.
- ఆలయ పరిసర ప్రాంతంలో మెడికల్ క్యాంపు జరుగుతుంది. మూడు షిఫ్టులలో వైద్యులు పనిచేయనున్నారు. ఇద్దరు పీహెచ్‌సీ డాక్టర్లతో పాటు ఆరుగురు స్పెషలిస్టు డాక్టర్లు ఉండేలా ఆదేశాలున్నాయి. దీంతో పాటు 10 మంది వరకు వైద్య సిబ్బంది క్యాంపులో ఉంటారు.
- ఆర్‌అండ్‌ బీ అధికారులు పట్నం నుంచి కాణిపాకం వరకు వచ్చే రోడ్డును అభివృద్ధి చేశారు. తిరువన్నంపల్లి రోడ్డును కూడా రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.
- పంచాయతీ శాఖ అధికారులు పారిశుద్ధ్య పనులు, తాగునీటి వసతి కల్పిస్తారు. పారిశుద్ధ్య సామగ్రిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చారు.
- విద్యుత్ శాఖ ఏడీ, ఏఈలు అందుబాటులో ఉండనున్నారు. పవర్ కట్ సమయంలో పవర్ జనరేటర్‌ను వాడుకుంటాం. విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకుంటాం.

భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులతోపాటు ఉభయదారులు, కాణిపాక వాసులు సహకరించాలని ఆయన కోరారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

- జిల్లా కోర్టు సెషన్స్ న్యాయమూర్తి రమేష్



మాట్లాడుతున్న జిల్లా కోర్టు సెషన్స్ న్యాయమూర్తి రమేష్

చిత్తూరు లీగల్ : బాలల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా కోర్టు సెషన్స్ న్యాయమూర్తి రమేష్ అన్నారు. శనివారం జిల్లా కోర్టులో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ, రక్షణ (జువైనల్) చట్టంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి రమేష్ మాట్లాడుతూ చిన్న పిల్లలు తెలిసో తెలియకో చేసిన నేరాలను క్షుణ్ణంగా పరిశీలించి, వారిలో మార్పులు తీసుకురావాల్సిన బాధ్యత పోలీసు, చైల్డ్‌వెల్ఫేర్ అధికారులు, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులపై ఉంటుందన్నారు. బాలల న్యాయ సంరక్షణ, రక్షణ చట్టం 2015పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. తెలిసో తెలియకో చట్టానికి విరుద్ధంగా నేరాలు చేసిన పిల్లలను జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందుకు 24 గంటల్లోగా హాజరుపరచాలన్నారు. నేరాలు చేసిన పిల్లలను కొట్టడం, మీడియా ముందుకు తీసుకురావడం వంటి చేయకూడదన్నారు. పిల్లలు ఏ కారణం చేత నేరాలు చేశారనే వివరాలను స్నేహపూర్వకంగా సైకాలజిస్ట్‌తో తెలుసుకోవాలన్నారు. వారి వివరాలను తెలుసుకుని మార్పు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎనిమిది, తొమ్మిదో అదనపు జిల్లా న్యాయమూర్తులు శ్రీదేవి, శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలు దేశ భవిష్యత్‌కు ముఖ్యమైన మూలధనం అన్నారు. వారి గురించి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. దివంగత ఏపీజే అబ్దుల్ కలామ్ సైతం అనాథ పిల్లల భవిష్యత్ గురించి మాట్లాడారని గుర్తుచేశారు. సమాజంలో ప్రతి ఒక్కరు అనాథ పిల్లల భవిష్యత్‌పై దృష్టి సారించాలన్నారు. మూడో అదనపు మేజిస్ట్రేట్, జువైనల్ జస్టిస్ బోర్డు న్యాయమూర్తి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పిల్లల భవిష్యత్ విషయంలో బాధ్యత కలిగి ఉండాలన్నారు. నేరం ఆరోపించబడిన పిల్లలు నేరస్తులు కారన్నారు. పిల్లల మానసిక స్థితిగతులను అర్థం చేసుకుని మెలగాలని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో తిరుపతి జిల్లా ప్రభుత్వ బాలుర అబ్జర్వేషన్ హోమ్ సూపరింటెండెంట్ శరత్‌బాబు, అపోలో మెడికల్ కాలేజ్ సైకియాట్రిస్ట్ డాక్టర్ దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు





విరాళాలు అందజేస్తున్న దాతలు

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయ నిత్యాన్నదాన ట్రస్టుకు శనివారం దాతలు నగదు విరాళం ఇచ్చారు. యాదమరి మండలానికి చెందిన సుబ్రమణ్యం రూ.లక్ష, అలాగే తెంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డికి చెందిన శివశంకరి రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాల చెక్కులను ఆలయాధికారులకు దాతలు అందజేశారు. వారికి ఆలయాధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది వాసు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలే తోడుగా.. నిలిచారు మేటిగా..

పట్టుదలకు శ్రమ తోడైతే విజయం సొంతమవుతుందని నిరూపించారు. మెగా డీఎస్సీ పరీక్షల్లో వేలాది మంది అభ్యర్థులను అధిగమించి ముందంజలో నిలిచారు. దొరికిన సమయాన్ని సద్వినియోగం చేసుకుని అహర్నిశలు శ్రమించారు. ప్రభుత్వ కొలువులు దక్కడమే గగనమైనే నేటి పరిస్థితుల్లో ఆచార్య కొలువులకు ఎంపికై తమ సత్తా చాటారు. శుక్రవారం అర్ధరాత్రి విడుదలైన ఫలితాలు చూసుకుని సంబరాలు చేసుకున్నారు.



- మెగా డీఎస్సీ ఫలితాలు విడుదల
- ఉద్యోగాలకు అర్హత సాధించిన పలువురు అభ్యర్థులు
- జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా
- అభ్యర్థుల వ్యక్తిగత ఐడీ లాగిన్లకు కాల్‌లెటర్లు
- సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియకు విద్యాశాఖ సన్నాహాలు
- కొందరు మొదట్లో క్వాలిఫైడ్. ఇప్పుడేమో నాట్ క్వాలిఫైడ్
- సందేహాల నివృత్తికి పనిచేయని విద్యాశాఖ హెల్ప్‌లైన్ నంబర్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న డీఎస్సీ అభ్యర్థులకు తుది ఫలితాలు శుక్రవారం అర్ధరాత్రి విడుదలయ్యాయి. సంవత్సరాల తరబడి ఆచార్య కొలువునకు శిక్షణ పొంది, సన్నద్ధం అయిన అభ్యర్థుల కలలు నెరవేరాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షలు రాసిన అభ్యర్థుల్లో ప్రతిభ చాటిన వారికి ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువులు దక్కాయి. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఎట్టకేలకు డీఎస్సీ అభ్యర్థుల తుది మెరిట్ జాబితాను సబ్జెక్టుల వారీగా విడుదల చేశారు. సంబంధిత జాబితాలను రాష్ట్ర విద్యాశాఖ డీఎస్సీ వెబ్‌సైట్‌తో పాటు, డీఈఓ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. సబ్జెక్టుల వారీగా పరీక్షలు రాసిన డీఎస్సీ అభ్యర్థులు తమ మెరిట్ జాబితాలను పరిశీలించుకునే వెసులుబాటు కల్పించారు. ర్యాంకుల వారీగా అభ్యర్థులు సాధించిన ఫలితాలను మెరిట్ జాబితాల్లో పేర్కొన్నారు. ఆ మెరిట్ ర్యాంకుల ఆధారంగా అభ్యర్థులు టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు సంతోషంగా సంబరాలు జరుపుకున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,478 పోస్టుల భర్తీ

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,478 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి మెగా డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల తుది ఫలితాలను ర్యాంకుల వారీగా పేర్కొన్నారు. జూన్ 5వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం విడుదల చేసిన తుది మెరిట్ జాబితా ఆధారంగా పోస్టులు భర్తీ చేయనున్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు అర్హత సాధించిన అభ్యర్థుల డీఎస్సీ వ్యక్తిగత లాగిన్‌లో కాల్‌లెటర్లను పంపనున్నారు. ఆ కాల్‌లెటర్ల ఆధారంగా అభ్యర్థులు నిర్దేశించిన కేంద్రంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంటుంది.

సర్టిఫికెట్ల పరిశీలనకు కసరత్తు



సర్టిఫికెట్ల పరిశీలన బృందాల శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో వరలక్ష్మి

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా మెగా డీఎస్సీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కాల్‌లెటర్లు అందగానే సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నారు. ఇందుకు చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా కసరత్తు చేస్తున్నారు. పరిశీలనకు హాజరయ్యే బృందాలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి సూచనలు జారీ చేశారు. ఈ ప్రక్రియకు చిత్తూరు జిల్లా కేంద్రానికి సరిహద్దులో ఉండే అపోలో యూనివర్సిటీ, ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలను పరిశీలన కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈ కేంద్రాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో డీఎస్సీ పరీక్షలో అర్హత సాధించిన 1,478 అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. ఆయా అభ్యర్థులకు కాల్‌లెటర్‌లో సూచించే తేదీలు, సమయంలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా టాపర్‌లు వీరే..

- స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) లో సాధియా 87.24 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచింది. ఈ సబ్జెక్ట్‌లో మొత్తం 1,190 మంది మెరిట్ జాబితాను ప్రకటించారు.
- స్కూల్ అసిస్టెంట్ (హిందీ)లో బురదగుంట బావాజీ 83.53 స్కోర్‌తో మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. మొత్తం 628 మంది మెరిట్ జాబితాను ప్రచురించారు.
- స్కూల్ అసిస్టెంట్ (తమిళం)లో కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. మొదటి స్థానంలో నందిని 65.04, రెండో స్థానంలో సెల్వరాజ్ 42.63 స్కోర్‌ను సాధించారు.
- స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)లో విజయ్ 87.01 తో మొదటి స్థానంలో నిలువగా 1,594 మంది ఫలితాలను ప్రకటించారు.
- స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ)లో సయ్యద్ షాహినూర్ 84.93 స్కోర్ తో మొదటి స్థానంలో నిలువగా 95 మంది మెరిట్ జాబితాను వెల్లడించారు.


స్కూల్ అసిస్టెంట్ నాన్ ల్యాంగ్వేజెస్ కేటగిరీలో..

- స్కూల్ అసిస్టెంట్ (బయాలజికల్ సైన్స్)లో అబ్దుల్ రహమాన్ 84.49, స్కూల్ అసిస్టెంట్ (బయాలజికల్ సైన్స్ తమిళ మీడియం)లో కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు. ఇందులో రవిబాబు, ప్రీతి 69.17 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. ఎస్‌ఏ (బయాలజికల్ సైన్స్ ఉర్దూ)లో సబీనా రహమతున్నీసా 65.10 స్కోర్‌తో, ఎస్‌ఏ (గణితం)లో సురేఖ 88.80, ఎస్‌ఏ (గణితం, తమిళం)లో తమిళ్ సెల్వి 66.10, ఎస్‌ఏ (గణితం, ఉర్దూ)లో మహమ్మద్ జిలానీ 67, ఎస్‌ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్)లో నవీన్ కుమార్ 91, ఎస్‌ఏ (ఫిజికల్ సైన్స్)లో రాజేష్‌కుమార్ 78.08, ఎస్‌ఏ (సోషల్)లో సురేష్‌కుమార్ 86.68, ఎస్‌ఏ (సోషల్, తమిళ మీడియం)లో తులసీరామన్ 67.47, ఎస్‌ఏ (సోషల్, ఉర్దూ)లో షేక్ మౌలాలి 65.52 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు.

ఎస్జీటీ పోస్టుల్లో..

సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)లో ఉషారాణి 94.62 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. ఎస్జీటీ (తమిళం)లో హేమలత 72.90, ఎస్జీటీ (ఉర్దూ)లో షేక్ అఫ్రీన్ తాజ్ 83.03 స్కోర్‌తో మొదటి స్థానం దక్కించుకున్నారు. అలాగే జోన్‌ల వారీగా పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ) మెరిట్ జాబితాలను, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ పోస్టుల మెరిట్ జాబితాలను విడుదల చేశారు.

మొదట్లో అర్హత...ఇప్పుడేమో అనర్హత



హెల్ప్‌లైన్ నంబర్లు పనిచేయడం లేదని ఓ వాట్సాప్ గ్రూప్‌లో బాధితురాలు పెట్టిన మెసేజ్

కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఎంతో ఆర్భాటం చేస్తోంది. అయితే ఈ కసరత్తులో పలుసార్లు తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా విడుదలైన డీఎస్సీ తుది మెరిట్ జాబితాలో పలువురు అభ్యర్థుల ఫలితాల్లో తప్పిదాలు చోటు చేసుకున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు మొదట్లో విడుదల చేసిన ఫలితాల్లో కొంత మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఇప్పుడేమో తాజాగా విడుదల చేసిన ఫలితాల్లో అనర్హత సాధించినట్లు పేర్కొన్నారు. ఈ ఫలితాలను చూసిన అభ్యర్థులకు పలు అనుమానాలు కలుగుతున్నాయి. మొదట్లో అర్హత రావడం....ఇప్పుడు అనర్హత రావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సమస్యతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చాలా మంది అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలు పరిష్కరించుకునేందుకు రాష్ట్ర వెబ్‌సైట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను అభ్యర్థులు సంప్రదిస్తున్నారు. అయితే ఆ హెల్ప్‌డెస్క్ నంబర్లు పనిచేయడం లేదని అభ్యర్థులు వాపోతున్నారు. తుది ఫలితాలు విడుదలైన సమయంలో హెల్ప్‌డెస్క్ నంబర్లు పనిచేయకపోవడంపై అభ్యర్థుల్లో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.

క్లుప్తంగా

ఆభరణాల చోరీ

చిత్తూరు అర్బన్: నగరంలోని కట్టమంచి లాయర్స్ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో శనివారం తెల్లవారుజామున ఆభరణాల చోరీ జరిగింది. ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన రామచంద్ర లాయర్స్ కాలనీలో కాపురముంటున్నారు. శుక్రవారం కలకడలోని తన బంధువుల ఇంటికి వెళ్లి, శనివారం ఉదయం ఇంటికి వచ్చి తలుపులు తెరిచి చూడగా.. వస్తువులు చిందరవందరగా పడున్నాయి. తీరా లోపలికి వెళ్లి చూడగా కిటికీ తొలగించి, ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించాడు. 15 గ్రాముల వరకు బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గంగాధర నెల్లూరు: ద్విచక్ర వాహనంలో అతివేగంగా వెళుతూ రోడ్డు పక్కన ఉన్న షాపును ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. వేల్కూరు సమీపంలో ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అశోక్ కుమార్ (28) పనిచేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో అగరమంగళం నుంచి వేల్కూరుకు ద్విచక్ర వాహనంలో తన తోటి కార్మికుడు కృష్ణకుమార్‌తో కలిసి బయలుదేరాడు. జీడీ నెల్లూరులో ద్విచక్రవాహనాన్ని అతివేగంగా నడపడంతో నియంత్రణ కోల్పోయి ఓ షాపును ఢీకొన్నాడు. ఈ ఘటనలో అశోక్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చుని ఉన్న కృష్ణకుమార్ సురక్షితంగా బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.2.10 లక్షల జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందికి రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శనివారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 21 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఆంధ్రకేసరికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుకు చిత్తూరు పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసులు నివాళులర్పించారు. ఆయన జయంతిని పురస్కరించుకుని శనివారం చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద ఎస్పీ మణికంఠ, అధికారులు నివాళులర్పించారు. స్వతంత్ర పోరాట యోధుడిగా, ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన చూపిన ధైర్యసాహసాలు, తీసుకొచ్చిన సంస్కరణలు నేటితరానికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, కార్యాలయ ఏఓ నాగభూషణమ్మ, ఎంటీఓ చంద్రశేఖర్, డీసీఆర్‌బీ ఎస్ఐ పద్మ తదితరులు పాల్గొన్నారు.

బార్‌కు లాటరీ నిర్వహించకపోతే ఫీజు వాపసు

చిత్తూరు అర్బన్: ఏదైనా మద్యం బార్ లైసెన్స్ కోసం కనీసం నాలుగు దరఖాస్తులు రాకపోయినా, లాటరీ నిర్వహించలేకపోయినా దరఖాస్తు ఫీజు తిరిగి చెల్లిస్తామని చిత్తూరు ఎక్సైజ్ సూపరింటెండ్ శ్రీనివాస్ తెలిపారు.

వర్షం.. అపార నష్టం



గుడిపాల: తిమ్మాపల్లెలో దెబ్బతిన్న వరిపంట



గుడిపాల: కోటూరులో దెబ్బతిన్న వరిపంట

- వర్షపునీటితో నిండిన పొలాలు
- దెబ్బతిన్న వరి పంట
- లబోదిబోమంటున్న రైతన్నలు

గుడిపాల: మండలంలో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. పొలాలన్నీ నీటితో నిండిపోయాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరి పంట కోతకు వస్తున్న దశలో గాలివాన కురవడంతో వరి పంటకు అపార నష్టం వాటిల్లింది. మండలంలో ప్రస్తుతం 115 హెక్టార్లలో వరి పంట పొట్ట, కోత దశలో ఉంది. కోత దశలో ఉన్న 20 హెక్టార్లలో వరి పంట దెబ్బతింది. రైతులు అప్పు చేసి సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయంలో దెబ్బతినడంతో వారు లబోదిబోమంటున్నారు. మండలంలోని చింతగుంటూరు, బొమ్మసముద్రం, 197రామాపురం, కోటూరు, తిమ్మయ్యపల్లెలో వర్షానికి దెబ్బతిన్న వరిపంటను వ్యవసాయాధికారి సంగీత పరిశీలించారు. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు ఆమె తెలిపారు. కొన్ని గ్రామాల్లో అరటి పంట కూడా దెబ్బతింది. మరకాలకుప్పం గ్రామంలో వేరుశనగ పంట నీట మునిగింది. అలాగే మామిడి, నిమ్మతోటల్లో నీరు నిలిచిపోయింది.





గుడిపాల: మరకాలకుప్పంలో నీట మునిగిన వేరుశనగ పంట, నిమ్మతోట

రాజనాలబండకు చేరిన చోరీ ఘటనలు

- చౌడేపల్లి, పుంగనూరులో జరిగిన వేర్వేరు చోరీలపై పంచాయితీ
- ప్రమాణం వచ్చేవారానికి వాయిదా
- నగదు, నగల అవహరణపై విచారణ

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్దకు రెండు చోట్ల జరిగిన వేర్వేరు చోరీ ఘటనలపై ప్రమాణాలు చేసేందుకు శనివారం ప్రజలు తరలివచ్చారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్, అర్చకుడు కృష్ణమూర్తి కథనం మేరకు.. చౌడేపల్లె మండలం దుర్గసముద్రం పంచాయతీ డి.రాజులూరుకు చెందిన కె.మాధవ తల్లి శ్యామలతో కలిసి ఉంటున్నారు. ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి పుంగనూరు సొంత పనిపై బయలుదేరాడు. ఆ సమయంలో ఇంటికి తాళాలు వేసి కిటికీలోని ముగ్గుపిండి నిల్వ ఉంచిన డబ్బాలో ఇంటి తాళాలు పెట్టి పుంగనూరుకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు కిటికి డబ్బాలో దాచిన ఇంటి తాళాలు తీసుకొని బీరువాను పగులగొట్టి, అందులో దాచిన బంగారు నగలు 40 గ్రాములు, వెండి అర కిలో బరువుగల నగలు చోరీ చేసి, మళ్లీ ఇంటికి తాళాలు వేసి కిటికీలోని డబ్బాలో పెట్టి ఉడాయించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఒకరు హాజరయ్యారు. పంచాయతీ నిర్వహించి ప్రమాణాలు చేసేందుకు వారం గడువు ఇచ్చారు. ఆలోపు నగలు చోరీ చేసిన వారు ఇంటి ఆవరణంలో కానీ లేదా ఆలయం వద్దకు చేర్చాలని సూచించారు. అలాగే పుంగనూరు మండలం ఈడిగపల్లె షికారిపాళేనికి చెందిన నరేష్ జూలై 28వ తేదీన గ్రామస్తులతో కలిసి రెండు ఆటోల్లో అనంతపురంలోని గుగ్గూల్ ప్రాంతంలో జరిగిన తిరుణాలలో బొమ్మలు విక్రయించడానికి వెళ్లారు. వ్యాపారం అనంతరం సుమారు రూ.1.50 లక్షలు సొమ్ము సంపాదించి ఆటోలో వస్తుండగా దారి మధ్యలో భోజనానికి ఓ హోటల్ వద్ద ఆపారు. ఆ సమయంలో బ్యాగులో దాచిన సొమ్మును ఆటోలో వెంట వచ్చిన వారే చోరీ చేశారు. నేరం అంగీకరించకపోవడంతో ఈ వ్యవహారం రాజనాలబండకు చేరింది. రెండు వేర్వేరు ఘటనలో అనుమానితులను ఆలయం విశిష్టత, చోరీ చేసినా నేరం అంగీకరించకపోతే జరిగే దుష్పరిణామాలను వివరించారు. అనంతరం వచ్చే వారానికి ప్రమాణాలు వాయిదా వేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. చివరి శ్రావణ మాసం శనివారం కావడంతో ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కడప విశ్రాంత తహసీల్దార్‌పై దాడి

పుంగనూరు: మదనపల్లె నుంచి పుంగనూరుకు బస్సులో ప్రయాణిస్తున్న కడప విశ్రాంత తహసీల్దార్ అంజాద్‌హుస్సేన్(70)పై పక్క సీట్లో కుర్చున్న వ్యక్తి ఘర్షణ పడి దాడి చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. సీఐ సుబ్బరాయుడు కథనం మేరకు.. కడప విశ్రాంత తహసీల్దార్ అంజాద్‌హుస్సేన్ పుంగనూరు తహసీల్దార్ రామును కలిసేందుకు బస్సులో పుంగనూరుకు వస్తున్నాడు. ఈ క్రమంలో పక్క సీట్లో కుర్చున్న షేర్‌ఖాన్ సెల్‌ఫోన్‌లో ఇతరులను దుర్భాషలాడుతూ పెద్దశబ్దం చేస్తూ మాట్లాడుతుండడంతో అలా మాట్లాడకండి అని అంజాద్‌హుస్సేన్ చెప్పాడు. దీంతో మీరెవరు నాకు చెప్పడానికి అంటూ విశ్రాంత తహసీల్దార్‌పై దాడి చేసి కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం



సుధీర్‌కుమార్ మృతదేహం

తవణంపల్లె: అప్పుల భారం అధికం కావడంతో భార్యతో గొడవ పడి ఇంట్లో పురుగులు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని తవణంపల్లె ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని అరగొండకు చెందిన డి.సుధీర్‌కుమార్(31) తిరుపతిలో డ్రైవింగ్ చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. తిరుపతిలో అప్పుల బాధ తట్టుకోలేక భార్యపిల్లలతో వచ్చి అరగొండలో నివాసం ఉంటున్నారు. అప్పులు కట్టకుండా పనులకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉండడంతో భార్యభర్తలు గొడవపడ్డారు. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి డి.కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

17 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 17 మందికి రూ.44 వేల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శనివారం తీర్పునిచ్చారు. చిత్తూరు టూటౌన్ పోలీసులు రెండు రోజులుగా పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 17 మందిని గుర్తించి, వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా.. జరిమానా విధించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున రూ.30 వేలు జరిమానా విధించినట్లు సీఐ నెట్టికంటయ్య తెలిపారు.

యువకుడి మృతిపై లేబర్ అధికారుల విచారణ

బంగారుపాళెం: మండలంలోని జయంతి గ్రామం వద్ద ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేస్తూ మరణించిన మైనర్ యువకుడి మృతిపై శనివారం చిత్తూరు లేబర్ అధికారులు విచారణ చేపట్టారు. ఈనెల 21వ తేదీ బిహార్ రాష్ట్రం చంబా జిల్లా జహీరా గ్రామానికి చెందిన సురేంద్రరాయ్ కుమారుడు బబ్లుకుమార్(19) ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా వెల్డింగ్ చేసేందుకు ఐరన్ రాడ్ పైకి తీసే క్రమంలో ప్రమాదవశాత్తు సమీపంలోని విద్యుత్ తీగకు తగలడంతో షాక్‌కు గురై బ్రిడ్జిపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చిత్తూరు అసిస్టెంట్ లేబర్ అధికారి ఆనంద్‌బాబు, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ ప్రసాద్‌తో కలసి ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. లేబర్ యాక్టు నిబంధనల ప్రకారం మైనర్ బాలుడిని పనుల్లో పెట్టుకున్న సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కర్ణాటక వాసి మృతి

బైరెడ్డిపల్లె: మండలంలోని బేలుపల్లె సమీపం వద్ద శనివారం వ్యవసాయబావిలో కర్ణాటక వాసి మృతి చెందిన సంఘటన వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు..కర్ణాటక రాష్ట్రం పెద్దగుట్టపల్లె గ్రామానికి చెందిన అశ్వత్థ (40) మండలంలోని పిచ్చిగుండ్లపల్లెలో అక్కను చూడటానికి రెండు రోజుల క్రితం వచ్చాడు. గ్రామ సమీపంలో ఉన్న పొలాల వద్దకు వెళ్లిన అశ్వత్థ ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. బావిలో మృతదేహం గమనించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పలమనేరు ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.



అశ్వత్థ మృతదేహం

రాష్ట్రంలో అరాచకపాలన



పంచలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- మిథున్‌రెడ్డి విడుదల కావాలని పంచలింగేశ్వరస్వామికి పూజలు

చౌడేపల్లె: శివయ్యా..రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించి మంచి బుద్ధి ప్రసాదించయ్యా అంటూ పుదిపట్ల పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ నేతల ఆధ్వర్యంలో పంచలింగేశ్వరస్వామివారికి శనివారం అభిషేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.దామోదరరాజు, పార్టీ మండల అధ్యక్షుడు జి. నాగభూషణరెడ్డి మాట్లాడుతూ అక్రమ కేసుల నుంచి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ పెద్దిరెడ్డి కుటుంబం పేరిట పంచ లింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేక పూజలు చేశారు. కూటమి ప్రభుత్వం గద్దె ఎక్కినప్పటి నుంచి ప్రజలకిచ్చిన హామీలు విస్మరించి వైఎస్సార్‌సీపీ నేతలను వేధించడం, పోలీసులను అడ్డంపెట్టుకుని కేసులు పెట్టడంపై దృష్టి పెట్టారని ఆరోపించారు. పేదల హామీల సంగతి విస్మరించి పరిశీలన పేరుతో దివ్యాంగులు పింఛన్ల కోత విధిస్తుందని, చిరుఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించి, వారి కడుపుకొడుతుందన్నారు. పెద్దిరెడ్డి కుటుంబానికి ఉన్న ప్రజాధరణ చూసి ఓర్వలేక రాజకీయ కుట్రలతో ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం చేయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోయకొండ పాలకమండలి మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, సర్పంచుల సంఘ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రామనారాయణరెడ్డి, వెంకటరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచులు హారతి, ఓబుల్‌రెడ్డి, షంషీర్, నాయకులు రెడ్డెప్పరెడ్డి, భరత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నాగభూషణరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చెంగారెడ్డి, నరేష్, శ్రీరాములు, గిరినాథ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజారెడ్డి, యశోద, అనుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో శాంతి భద్రతలకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. వినాయక విగ్రహాలు నిమజ్జనం కట్టమంచి చెరువులో మాత్రమే చేయాలన్నారు. చెరువు వద్ద సరిపడే బారికేడ్లు, ఫోకస్ లైట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పెద్ద క్రేన్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీఎస్పీ సాయినాథ్ మాట్లాడుతూ గత సంవత్సరం వినాయకుని ఉత్సవాలు ప్రశాంతంగా జరిగాయన్నారు. అలాగే ఈసారి చిన్న సంఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. నిమజ్జనం మార్గంలో కరెంట్ వైర్‌లు, కేబుల్ వైర్‌లు అడ్డు రాకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేసే మూడు, ఐదు, తొమ్మిది, పదకొండో రోజుల్లో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు రామభద్ర, హరి, జయచంద్ర, వెంకటేష్, సీఐలు మహేశ్వర్, నెట్టికంతయ్య, అడిషనల్ ఫైర్ ఆఫీసర్ కరుణాకరన్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

మహిళ ఆత్మహత్య

పుంగనూరు: భర్త మందలించాడని భార్య పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వనమలదిన్నెలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని వనమలదిన్నెకి చెందిన భాస్కర్ భార్య దుర్గ(34) తన పిల్లలను మందలిస్తుండగా భర్త ఆమెను మందలించాడనే కోపంతో ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగి ఆత్మహత్య పాల్పడింది. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు శవాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దుర్గ మృతదేహం

జనసేన మండల అధ్యక్షుడిపై కేసు నమోదు

గుడిపాల: ఆంధ్రప్రదేశ్ నుంచి తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఘటనకు సంబంధించి జనసేన గుడిపాల మండలం అధ్యక్షుడు రూప్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. చిత్తూరు రూరల్ మండలం ఎన్ఆర్‌పేట ఇసుక రీచ్ నుంచి తమిళనాడుకు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు శనివారం తెల్లవారుజామున 2 గంటలకు పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఆ సమయంలో అక్కడ టీఎస్05 ఆర్0839 నంబర్ టిప్పర్ తమిళనాడులోని పొన్నై వైపు వెళుతుండగా పట్టుకున్నారు. టిప్పర్ డ్రైవర్ శరవణని అరెస్టు చేశామని ఎస్ఐ చెప్పారు. డ్రైవర్ చెప్పిన వివరాల ప్రకారం టిప్పర్ యజమాని శేఖర్‌తోపాటు ఇసుకను డంప్ చేసి అక్రమంగా టిప్పర్ ద్వారా తమిళనాడుకు ఇసుకను పంపిస్తున్న జనసేన గుడిపాల మండల పార్టీ అధ్యక్షుడు రూప్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



గుడిపాల పోలీసులు సీజ్ చేసిన ఇసుక టిప్పర్